క్లుప్తంగా

'గందరగోళం వద్దు'

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్న క్రమంలో అధికారుల ఆదేశాలు రాకముందే సోషల్‌మీడియాలో అనవసరమైన పోస్టులు పెట్టి ప్రజల్ని గందరగోళ పర్చవద్దని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి అన్నారు. మహాలక్ష్మి పథకం దరఖాస్తు నమూనా, గ్యాస్ సిలిండర్ కోసం ఈకేవైసీ పేరిట ప్రజలు తొందరపడి మీ–సేవ, ఆన్‌లైన్ కేంద్రాలతోపాటు గ్యాస్ ఆఫీసుకు పోవద్దని సూచించారు. ప్రభుత్వ ఉన్నత, మండల అధికారులు తగు ప్రకటనలు జారీ చేస్తేనే ఆ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలే తప్ప అనవసరమైన ఆందోళనకు ప్రజలు గురికావొద్దని అన్నారు.

బియ్యం అందజేత



పాలకుర్తి: మండల కేంద్రంలో గాదెపాక కొమురయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, గురువారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులను బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా దాత బండి భగవంత్‌కు ట్రస్టు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జీడి హరీశ్ తదితరులు ఉన్నారు.

నియామకం


మహేందర్

చిల్పూరు: కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్‌గా తీగల తండాకు చెందిన తీగల మహేందర్‌ను నియమించినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర గురువారం తెలిపారు. ఈ సందర్భంగా తీగలతండాలో మహేందర్ విలేకరులతో మాట్లాడుతూ పార్టీ నాయకుల సహకారంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోపు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తానన్నారు. పార్టీ అధికారంలో ఉన్నందున గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జెడ్పీటీసీల గెలుపునకు పూర్తి స్థాయిలో కష్టపడతానని తెలిపారు. తనకు పదవి వచ్చేలా కృషిచేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

నివాళి



చిల్పూరు: ఇటీవల గుండెపోటుతో జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి మృతి చెందాడు. కాగా, మండలంలోని రాజవరంలో గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ మారేపల్లి తిరుమలకృష్ణ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ మారేపల్లి లలితాదేవి విశ్యాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ హైమావతి, కారోబార్ గూడూరు భాస్కర్, ఏఈఓ వినయ్‌కుమార్, వార్డు సభ్యుడు సతీష్‌రెడ్డి, ఏఎన్ఎం సంతోష, ఆశ కార్యకర్తలు పద్మ, రేణుక, విజయ, అంగన్‌వాడీలు రాజ్యలక్ష్మి, లలిత, యాదమ్మ అసాద్, వెంకటస్వామి, ఈర్ల సమ్మయ్య, కర్నాల యాదగిరి, ఎడ్ల మహిపాల్, కన్నెబోయిన రమేశ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

మామునూరు: రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులు అవగాహన పెంచుకోవాలని కాజీపేట ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ రావెళ్ల రామారావు సూచించారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌లో కమాండెంట్ శివ ప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో జరుగుతున్న స్పెషల్ పోలీసుల 30రోజుల మాన్యువల్ రిఫ్రెషమెంట్ కోర్స్ శిక్షణ శిబిరానికి ఆయన గురువారం హాజరై ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు.

రాముడి పూజిత అక్షింతల కలశ స్వాగత ర్యాలీ



మడికొండ: మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి అయోధ్య శ్రీరాం లీల మందిరంలో వరకు కొనసాగిన శ్రీరాముడి పూజిత అక్షింతల కలశ స్వాగత ర్యాలీని విశ్వహిందూ పరిషత్ – భజరంగ్ దళ్ వరంగల్ మహానగర్ వాసులు గురువారం సాయంత్రం ప్రారంభించారు. విశ్వహిందూ పరిషత్ వరంగల్ కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు వెలగందుల రాజు, సహాయ కార్యదర్శి సందీప్‌రెడ్డి, అలకట్ల సాయికుమార్, భజరంగ్ దళ్ మహానగర్ జిల్లా కన్వీనర్ గంగారపు హరీశ్, కోకన్వీనర్ రూపిరెడ్డి సూర్యప్రకాష్ రెడ్డి, నాయకులు చాడ శ్రీనివాసురెడ్డి, రావుల కిషన్, జలగం రంజిత్, బన్న ప్రభాకర్, వెంకట్‌రావు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి


జఫర్‌గఢ్: మగ్గుంతండాలో సర్వే చేస్తున్న సీఆర్‌పీ స్వామి


జనగామ రూరల్: తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీనివాస్

జఫర్‌గఢ్: బడీడు పిల్లలను బడిలో చేర్పించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలని మండల నోడల్ అధికారి ఎండీ పర్వేజ్ కోరారు. సమగ్ర శిక్షా అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని జఫర్‌గఢ్, కూనూర్, తిమ్మంపేట స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ఆయా గ్రామాల ఆవాస ప్రాంతాల్లో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 19 సంవత్సరాల బడీడు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించేందుకు క్లస్టర్ రిసోర్స్ పర్సన్ల ద్వారా సర్వే కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ సర్వే అధారంగా గుర్తించిన పిల్లలను బడిలో చేర్పించేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రాథమిక విద్యతో పాటు 10వ తరగతి, ఇంటర్‌లో బడి మానేసిన విద్యార్థులను గుర్తించి ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో వారిని చేర్పించేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. జఫర్‌గఢ్, తిమ్మంపేట, కూనూర్ క్లస్టర్ పరిధిలో ముగ్గురు సీఆర్‌పీల ద్వారా సర్వే నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు గణేశ్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సీఆర్‌పీ పుట్ట స్వామి తదితరులు పాల్గొన్నారు.

జనగామ రూరల్: బడీడు పిల్లలను బడిలో చేర్పించి చదువుకొనేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంప్లెక్స్ హెచ్ఎం జి.శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం పట్టణంలో అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ సర్వేలో భాగంగా పట్టణంలోని ధర్మకంచ హాబిటేషన్ జూనియర్ కళాశాల ఆధ్వర్యాన గుడిసెల ప్రాంతంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ బడీడు పిల్లలు బయట ఉండకుండా పాఠశాలల్లో చేర్పించడం ద్వారా వారి భవిష్యత్‌కు బాటలు వేసిన వారమవుతామని అన్నారు. పిల్లలు మధ్యలో చదువు మానేయకుండా చూసేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి సదుపాలయాలు కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలనారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరిస్తా..

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


మాట్లాడుతున్న దయాకర్‌రావు

దేవరుప్పుల : ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తూ ప్రభుత్వ పరమైన అభివృద్ధి పనుల పురోగతికి తన వంతు సహకరిస్తానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ మండల స్థాయి సమావేశంలో సార్వత్రిక ఎన్నికలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తెచ్చిన కేసీఆర్ హయాంలో రైతు సంక్షేమం కోసం చేసిన అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం రాద్ధాంతం చేసే తీరు తగదన్నారు. తన హయాంలో పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.450 కోట్ల పనులు మంజూరు చేశానన్నారు. ఇకపై వారానికో మండలాన్ని పర్యటించి గ్రామస్థాయిలో సమీక్షలు నిర్వహించి పార్టీకి పూర్వవైభం తెస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పల్లా సుందర్ రామిరెడ్డి, బస్వ మల్లేశమ్, ఎంపీపీ బస్వ సావిత్రి, వైస్ఎంపీపీ విజయ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, నక్క రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వంగాల చిరంజీవి మృతి తీరనిలోటు

బీఆర్ఎస్ మండల యువజన నాయకుడు వంగాల చిరంజీవి అకాల మృతి ఆ కుటుంబంతోపాటు పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి దయాకర్‌రావు అన్నారు. గురువారం ధర్మాపురంలో చిరంజీవి సంతాపసభలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీత్యతండాలో అనారోగ్యంతో మృతి చెందిన గుగులోత్ వీరన్న కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో నాయకులు దయాకర్, రవి, కారుపోతుల భిక్షపతి, సర్పంచ్ బజ్జూరి అశోక్, ఎంపీటీసీ ఉపేందర్, కృష్ణమూర్తి, కూతాటి నర్సింహులు, బీఆర్ఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డం రాజు, వంగ అర్జున్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు వందశాతం వసూలు చేయాలి


జీపీ రికార్డులు పరిశీలిస్తున్న అరవింద్‌చౌదరి

నర్మెట: గ్రామ పంచాయతీలు వందశాతం పన్నులు వసూలు చేయాలని, పారిశుద్ధ్యంలో మండలాన్ని ప్రథమ స్థానంలో నిలిచేలా కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఎంపీఓ అరవింద్ చౌదరి అన్నారు. మండలకేంద్ర గ్రామపంచాయతీని గురువారం సందర్శించిన ఆయన రికార్డులను పరిశీలించి కార్యదర్శి కందకట్ల శ్రీధర్, బిల్‌కలెక్టర్ చిర్ర వెంకట్ రెడ్డికి పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, క్లోరినేషన్, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడంలో ప్రత్యేక దృష్టిసారించాలని, ప్రజలు సకాలంలో పూర్తిస్థాయిలో పన్నులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న జగదీశ్‌చందర్‌రెడ్డి

రఘునాథపల్లి: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోపు పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీశ్‌చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోడూరులో పార్టీ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో గురువారం ముఖ్య కార్యకర్తలతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇస్తామని నేటికి ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఇచ్చిన హామీలో భాగంగా సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే రెండు గ్యారంటీలను అమలు చేశారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె రమేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు అంజయ్య, మేకల నరేందర్, బానోతు భిక్షపతి, అరవింద్‌రెడ్డి, కావటి భాస్కర్, నీలం యువరాజ్, నట్ల యాకమ్మ తదితరులు ఉన్నారు.

టీఎస్ యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


అధ్యక్ష, కార్యదర్శులు

నర్మెట: టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కూరోజు ఆగయ్య, ఉపాధ్యక్షులుగా శివప్రసాద్, అన్నామేరి, ప్రధాన కార్యదర్శిగా బిర్రు ఉప్పలయ్య, కోశాధికారిగా రాజ్ కిరణ్, కార్యదర్శులుగా రాజయ్య, రజని, హరిచంద్, యాకాంత్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని 1వ తేదీన వేతనాలు, పెండింగ్ బిల్లులను చెల్లించాలని, ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు యాదవరెడ్డి, ఉపాధ్యాయులుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో బహుళ ప్రయోజనాలు


కూలీలకు సూచనలు ఇస్తున్న ఉమామహేశ్వర్

దేవరుప్పుల: జాతీయ ఉపాధి హామీ పథకం పనులతో బహుళ ప్రయోజనాలు కలుగుతాయని ఎంపీడీఓ వడ్డెపల్లి ఉమామహేశ్వర్ సూచించారు. గురువారం మండలంలోని ధారావత్‌తండా, పెద్దమదూరు, ధర్మగడ్డతండాలో చేపడుతున్న ఉపాధిహామీ పనులు, నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో కొనసాగే ఉపాధి పనులతో కూలీలకు భృతి కల్పన ఆధారితంగా గ్రామాల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి బహుళ ప్రయోజనం చేకూర్చే ఉపాధి పనులపై నిర్లక్ష్యం చేయకుండా నిర్దేశిత కూలీల శాతం పెరిగేలా శాశ్వత ప్రాతిపదికన పనులకు ప్రాధాన్యం ఇచ్చేలా తోడ్పాటు అందించాలని సూచించారు. మొక్కల పెంపకం కోసం చేపడుతున్న నర్సరీల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ కమ్మగాని శ్రీనివాస్, టీఏ నర్సింహ, పంచాయతీ కార్యదర్శులు శివారెడ్డి, సంధ్యారాణి, అనిల్ రాథోడ్, ఫీల్డ్ అసిస్టెంట్ పుణ్యవతితోపాటు తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు చేయూత


అనాథలకు సైకిల్‌తో పాటు ఆర్థికసాయం అందజేస్తున్న నూకరాజు, ఆసియా

లింగాలఘణపురం: టీవీ జబర్దస్త్ ఆర్టిస్టులు నూకరాజు, ఆసియా లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన అనాథ పిల్లలు నిఖిల, అఖిలకు గురువారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. దీంతో పాటు పాఠశాలకు వెళ్లేందుకు సైకిల్, ఇద్దరి చిన్నారులకు దుస్తులను కూడా అందించారు. వీరి తల్లిదండ్రులు రెండేళ్ల క్రితం మృతిచెందడంతో అనాథలుగా మిలిగారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ తమ యూట్యూబ్ చానల్‌లో వారి బ్యాంకు అకౌంట్‌ను లింక్ చేసి వ్యూవర్స్‌తో వచ్చే ఆదాయం కూడా వారికే వచ్చేవిధంగా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు శ్రీహరి, మాజీ సర్పంచ్ యాదగిరిస్వామి, వీరయ్య, గట్టగల్ల అనిల్, నల్ల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న శివకుమార్

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన చెక్క హన్నయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను కోడూరు శివకుమార్ పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు యాట రామచంద్రయ్య, నాగపూరి భిక్షపతి, తేలు శ్రీనివాస్, పిట్టల ఇస్తారి, కుర్రాం వెంకటయ్య, చెక్క కనకయ్య, కొంక కనకయ్య, యాట సాయిలుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ


పరీక్ష మెటీరియల్‌తో విద్యార్థులు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయ ఇంటర్ విద్యార్థులకు ఎక్స్‌ట్రామేళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ వాస్తవ్యులు నాగమోహన్ పరీక్ష మెటీరియల్‌ను ఉచితంగా పల్లె రాజిరెడ్డి చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిహెచ్ స్వప్న మాట్లాడుతూ ఇంటర్ చదువుతున్న 16 మంది విద్యార్థులకు పరీక్షకు సంబంధించిన మెటీరియల్‌ను దాత నాగమోహన్ ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. కస్తూర్బా విద్యాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'గెలుపును ఓర్వలేక విమర్శలు'

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి మార్పును కోరుకొని అధిక స్థానాల్లో గెలిపించినందులకు ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అనవసరమైన విమర్శలు చేస్తున్నారని బచ్చన్నపేట ఎంపీటీసీలు నల్లగోని పుష్ప, అల్వాల రాధ అన్నారు. గురువారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాలు రాష్ట్రంలో పరిపాలన సాగించి పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేయలేకపోయిందని, అభివృద్ధి పేరిట రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వారంరోజులు కాకుండానే ఇచ్చిన హామీలు ఏమైనట్లు అని విమర్శలు చేయడం సరికాదన్నారు. అప్పులపాలు చేసిన రాష్ట్రంలో పరిపాలన గాడిలో పడటానికి సమయం పడుతుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, అలాగే రూ.10లక్షల ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేశారని తెలిపారు. దశల వారిగా అన్ని హామీలను సీఎం అమలుచేస్తాని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాలకిషన్‌గౌడ్, ఎల్లయ్య, మహాత్మాచారి పాల్గొన్నారు.

ఘనంగా మినీ క్రిస్మస్ వేడుకలు


ప్రార్థన చేస్తున్న సింగపురం ఇందిర తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని ఓఫంక్షన్ హాల్‌లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర ఆధ్వర్యంలో ఆమె భర్త అమృతయ్య జ్ఞాపకార్థం గురువారం మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిర కేక్ కట్ చేసి క్రైస్తవులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పాస్టర్లకు, క్రైస్తవులకు క్రిస్మస్ కానుకగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పాస్టర్లు, ఫాదర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎండీఆర్టీకి రెండోసారి యాదగిరి ఎంపిక


యాదగిరిని సన్మానిస్తున్న బ్రాంచి మేనేజర్

స్టేషన్‌ఘన్‌పూర్: ఎల్ఐసీలో ఎండీఆర్టీ(మిలియన్ డాలర్స్ రౌండ్ టేబుల్) సమావేశానికి మండలంలోని శివునిపల్లికి చెందిన ఎల్ఐసీ అడ్వయిజర్ గోరంతల యాదగిరి వరుసగా రెండో సారి ఎంపికయ్యారు. ఈ మేరకు స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో యాదగిరిని గురువారం బ్రాంచి మేనేజర్ మోతీలాల్, డీఓ సదాకోటి తదితర ఉద్యోగులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాలో జరిగే ప్రతిష్ఠాత్మకమైన ఎండీఆర్టీ సమావేశానికి ఎంపిక కావడం సంతోషంగా ఉందని అన్నారు. సహకరించిన ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక సమరంలోనూ సత్తా చాటాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

కొడకండ్ల: అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే త్వరలో జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేసి సత్తా చాటాలని కొడకండ్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ కోరారు. గురువారం లక్ష్మక్కపల్లి, పెద్ద బాయితండాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలంతా కలిసికట్టుగా కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి గెలుపునకు ఎనలేని కృషి చేసి మండలంలో మెజార్టీ లభించేలా కృషి చేశారని, అభ్యర్థి విజయానికి పనిచేసిన వారందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి షెక్ అబ్దుల్లా, నాయకులు రవీందర్, భిక్షం, జంపాల శ్రీను, రమేష్, భిక్షపతి, కృష్ణ, అంజయ్య, నాగరాజు, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

మడేలయ్య ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులో శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరగనున్న మడేలయ్య ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు వివిధ ప్రాంతాల నుంచి పండితులు, బంధు, మిత్రులు రానున్న నేపథ్యంలో రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. చలువ పందిళ్లు వేశారు. రజక సంఘం పెద్దల ఆధ్వర్యంలో సీతాలమ్మ సమేత మడేలయ్య, ఈశ్వరమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నారు.

కాంగ్రెస్ నాయకులకు సన్మానం


సన్మానం పొందిన నాయకులు

దేవరుప్పుల: మండలంలోని పెద్దమదూరులో కాంగ్రెస్ యువజన నాయకుడు గొడిశాల వేణు ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులకు శాలువాలతో సన్మానించారు. గురువారం గ్రామంలో మాజీ సర్పంచ్ భువనగిరి నరసింహులు ఆధ్వర్యంలో మైసమ్మ పండగ నిర్వహించగా కాంగ్రెస్ శ్రేణులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యేగా యశస్వినిరెడ్డి గెలుపునకు పాటుపడిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, పీఏసీఎస్ డైరెక్టర్ ఆకవరం రవీందర్ రెడ్డి, సోమిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రుద్రోజు పురుషోత్తమచారి, దామెర అనిల్, ఉప్పుల అనిల్, ప్రకాష్ తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రుద్రోజు భాస్కరాచారి, గొడిశాల వేణు, నాయకపు శ్రీనివాస్, మానుపాటి బుగ్గయ్య, బోనగిరి పరశురాములు, సోమన్న, మామిళ్ల రామన్న, సోషల్ మీడియా మండల ఇంచార్జీ రెడ్డి రాజుల ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

వేలేరు : జ్యూట్ బ్యాగుల తయారీకి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నాబార్డు డీడీఎం ఎల్.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని పీచర రైతువేదిక వద్ద జూట్ బ్యాగుల తయారీపై 15రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సహాయ సోషల్ సర్వీస్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, జ్యూట్ బ్యాగుల వాడకాన్ని ప్రోత్సహించాలని అన్నారు. జూట్ బ్యాగులతో పాటు లంచ్ బాక్సులు, క్యారీబ్యాగులు, పర్సులు, సెల్‌ఫోన్ కవర్‌లు, ఆఫీస్ బ్యాగులను తయారీ చేస్తూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, వేలేరు ఎస్‌బీఐ మేనేజర్ అక్తరున్నీసా, ఏఈఓ బాబు, ఫీల్డ్ ఆఫీసర్ శ్రవణ్ కూమార్, సహాయ సంస్థ కార్యదర్శి విజయ్‌కుమార్, మహిళలు పాల్గొన్నారు.